రేపు సాక్షి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

చంపాపేట: సంక్రాంతిని పురస్కరించుకుని ఈ నెల 11న సాక్షి, కర్మన్‌ఘాట్ శ్రీసరస్వతీ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ లెక్కల లలితారెడ్డి పేర్కొన్నారు. కర్మన్‌ఘాట్ శుభోదయ కాలనీలోని భగత్‌సింగ్ క్రీడా మైదానంలో శనివారం ఉదయం 9.30లకు పోటీలు ప్రారంభం అవుతాయని పాల్గొనే మహిళలు తాము వేసే ముగ్గులకు సంబంధించిన రంగులను తమ వెంట తెచ్చుకోవాలన్నారు. పోటీల్లో పాల్గొనే వారికి బహుమతులు అందజేస్తారని పూర్తి వివరాలకు 9959564939, 9705347247 నంబర్లను సంప్రదించాలన్నారు.

ట్రేడ్ లైసెన్స్ ఫీజు, బకాయిలు చెల్లించండి

చాదర్‌ఘాట్: ట్రేడ్ లైసెన్స్ ఫీజు, బకాయిలను ఈ నెల 31 లోగా చెల్లిస్తే జరిమానా ఉండదని జీహెచ్ఎంసీ సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ యాప్, మీ సేవా కేంద్రాలు, జీహెచ్ఎంసీ సిటిజెన్ సర్వీస్ సెంటర్ ద్వారా చెల్లించాలన్నారు.

గడువులోగా సర్వే పూర్తి చేయాలి

చాదర్‌ఘాట్: గడువులోగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలని ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ కార్పొరేటర్ షఫిఉద్దీన్ సూచించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో సంబంధిత సిబ్బందితో సర్వే తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్ జాబితాలో పేరు ఉన్న ప్రతి దరఖాస్తుదారుడి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న చాలా మంది పేర్లు సర్వే జాబితాలో లేవని ఇదే విషయాన్ని డీసీ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు.

చైతన్యపురిలో ముగ్గుల పోటీలు

చైతన్యపురి: చైతన్యపురిలోని లిటిల్ విల్లే ప్లే స్కూల్‌లో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. కాలనీలోని యువతులు, మహిళలు పోటీలో పాల్గొని సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా ముగ్గులు వేశారు. విజేతలకు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లె కృష్ణమూర్తి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రచన వరాల్, హరిత మహావాపి పాల్గొన్నారు.

సహారాస్టేట్స్‌కాలనీలో ..

మన్సూరాబాద్: పండుగల విశిష్టత, సంస్కృతి, సంప్రదాయాలు నేటి యువతకు తెలియజేయాల్సిన అవసరం ఉందని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. సహారాస్టేట్స్‌కాలనీలో గురువారం కాలనీ మెయింటనెన్స్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లోని విజేతలకు కార్పొరేటర్ బహుమతులను అందజేశారు. కీర్తిశ్రీ ప్రథమ, రత్నకుమారి ద్వితీయ, భవానీ తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. కాలనీ మెయింటనెన్స్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ జానీ, సుదర్శన్ రెడ్డి, శేఖరయ్య, మంజుల, భీమానాయక్, వెంకటాద్రి, పార్థసారథి పాల్గొన్నారు.

డైరీ, కేలండర్ ఆవిష్కరణ

మలక్‌పేట: పీఆర్‌టీయూ టీఎస్ సైదాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం మలక్‌పేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల డిప్యూటీ ఈఓ రాధాకృష్ణ నూతన సంవత్సర డైరీ, కేలండర్‌ను ఆవిష్కరించారు. డిప్యూటీ ఐఓఎస్ వరప్రసాద్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మందడి వెంకటరెడ్డి, మండల అధ్యక్షులు అంజనేశ్వరరావు, కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

మాస్టర్ చెఫ్ పోటీలు



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే పురం నారాయణ పాఠశాలలో గురువారం నిర్వహించిన మాస్టర్ చెఫ్ పోటీల్లో పిల్లలు వివిధ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తయారు చేశారు. పిల్లలు వారు తెచ్చిన వంటకాలను ఏ విధంగా తయా రు చేశారో వివరించారు. ఈ కార్యక్రమంలో డీ జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం హేమాంబర్, ఆర్ఐ రవిప్రసాద్, ప్రిన్సిపల్ నీరజ, సిబ్బంది మహే శ్వరి, సమన్వయ కర్త గాయత్రి, ఏఓ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణలత, శ్రావణి పాల్గొన్నారు.

సాయి ఆలయంలో ఉత్తరద్వార దర్శనం

చైతన్యపురి: ముక్కోటి ఏకాదశి సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో ఉ త్తర ద్వార దర్శనం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ శ్యాంకుమార్ తెలిపారు. శుక్రవా రం ఉ.5 గంటల నుంచే దర్శనాలు ప్రారంభం అవుతాయని 7 గంటలకు బాబాకు తులసిమాలతో అలంకరణ, 8.30లకు రమాసహిత శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు, 9 గంటలకు శ్రీసుదర్శన హోమం, మ.3 గంటలకు శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం ఉంటుందన్నారు.

మల్లన్న జాతరకు సర్వం సిద్ధం

రేపటి నుంచి కరణ్‌బాగ్ మల్లన్నస్వామి జాతర వేడుకలు

- 400 ఏళ్ల చరిత్ర గల దేవాలయం
- స్వామి స్వయంభూగా వెలిశాడని భక్తుల నమ్మకం



బలిజ మేడలాదేవి, శ్రీగొల్లకేతమ్మ సమేత మల్లికార్జునస్వామి



ఆలయంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈఓ, మాజీ ధర్మకర్తలు

సైదాబాద్: నాలుగు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన కరణ్‌బాగ్ మల్లన్నస్వామి జాతర మహోత్సవాలకు సిద్ధమవుతోంది. ఆలయంలో స్వామివారు పుట్టమన్నుతో స్వయంభువుగా వెలిశాడని నమ్మే భక్తులు, ఆలయ అధికారులు ప్రతీయేడు మల్లన్న స్వామి జాతర, ఆలయంలోని బలిజ మేడలాదేవి, శ్రీగొల్లకేతమ్మ సమేత శ్రీమల్లికార్జునస్వామి కల్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. వేడుకల్లో గంగతెప్ప, అగ్నిగుండాలు, పటం ఏర్పాటు, గొలుసు తెంపడం వంటి సాంప్రదాయాలతో జాతర జరిపే మూడు రోజుల పాటు ఆలయ ప్రాంగణం గ్రామీణ వాతావరణాన్ని సంతరించుకుంటుంది. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా స్వామి వారిని నమ్మే భక్తులు వేడుకలకు ప్రతీ సంవత్సరం పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. ప్రతీ యేడు మాదిరిగానే ఈ సారి కూడా స్వామివారి జాతర, కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించేలా అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఈ నెల 11 నుంచి 13 వరకు మూడు జరిగే వేడుకలకు భక్తులు పోటెత్తుతారు.

ప్రత్యేక కార్యక్రమాలు..

మూడ్రోజుల పాటు జరిగే మల్లన్న స్వామి జాతర వేడుకల్లో మొదటి రోజైన ఈ నెల 11న తెల్లవారు జామున స్వామి వారి మేలుకొలుపు, అభిషేకం, బిల్వార్చనలతో జాతర ప్రత్యేక కార్యక్రమాలు మొదలవుతాయి. సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించిన అనంతరం అదే రోజు సాయంత్రం గంగ తెప్ప, శ్రీమల్లన్నస్వామి వారి ఊరేగింపు నిర్వహిస్తారు. రెండవ రోజైన 12న మధ్యాహ్నం శ్రీ బలిజ మేడలాదేవి, శ్రీ గొల్ల కేతమ్మ సమేత శ్రీమల్లికార్జునస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహిస్తారు. సాయంత్రం పటం, అగ్నిగుండాలు, గొలుసు తెంపడం కార్యక్రమాలు నిర్వహిస్తారు. చివరి రోజైన 13న శ్రీ రేణుకా ఎల్లమ్మ, శ్రీ నల్ల పోచమ్మ, శ్రీ మహంకాళి అమ్మవార్లకు బోనాలు సమర్పించడంతో జాతర వేడుకలు ముగుస్తాయి. జాతర ముగింపు రోజున ఆలయం తరపున భక్తులకు ఒడిబియ్యం పోయడం, ముత్తయిదువులకు పసుపు కుంకుమ కొత్తగాజులు అందజేస్తారు.

అందరి సహకారంతో..



భక్తులు, ప్రజాప్రతినిధులు, దాతలు అందరి సహకారాలతో ప్రతీ ఏడాది కరణ్‌బాగ్ మల్లన్న స్వామి జాతర, కల్యాణం వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నాం. ప్రతీ సంవత్సరం భక్తుల సంఖ్య పెరుగుతూనే ఉంటుంది. వేడుకల్లో ఎలాంటి అవాంతరాలు చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటూ భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు చేపట్టిన పనులను ఆలయ మాజీ ధర్మకర్తలు మడిగెల లక్ష్మారెడ్డి, కోషిక కృష్ణ, ఆలయ ప్రతినిధి త్రిమూర్తులుతో నిత్యం పరిశీలిస్తున్నాం.

–పీఎస్‌వీ సత్యనారాయణ, ఆలయ కార్యనిర్వాహణాధికారి

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అధికారులకు సూచించారు. మోహన్‌నగర్ కాలనీలో నూతనంగా వేసిన డ్రైనేజీ లైన్ పనులు పూర్తి కావడంతో, సీసీ రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్యాచ్‌వర్క్ పనుల్లో నాణ్యత పాటించాలని గతంలో డ్రైనేజీ పనులు చేసిన కాలనీలో ప్యాచ్‌వర్క్ సరిగ్గా చేయకపోవడంతో వర్షానికి కొట్టుకుపోయి గుంతలుగా మారాయని గుర్తు చేశారు. కార్పొరేటర్ వెంట రాజశేఖర్, మురళీ కృష్ణ, నాయకులు సుందర్ నారాయణ, ఠాకూర్ అశ్విన్ సింగ్ ఉన్నారు.

- కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ సమక్షంలో నూతనంగా కొత్తపేట బీజేపీ డివిజన్ అధ్యక్షులుగా ఎన్నికైన మంచి రాజేష్‌కుమార్, రంగారెడ్డి జిల్లా అర్బన్ ప్రతినిధిగా ఎన్నికై న కాటవిజయను కార్పొరేటర్ పవన్‌కుమార్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగారెడ్డి, వజీర్‌కుమార్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, రాజేష్, కుషిద్, సుందర్ నారాయణ, రాకేష్ యాదవ్, నాయికోటి అనిల్‌కుమార్, నరసింహ పాల్గొన్నారు.

కోడింగ్‌పై పట్టుతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న సోంకీషా

చంపాపేట: సాఫ్ట్‌వేర్ రంగంలోని కోడింగ్‌పై పట్టు ఉంటేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆర్ఫ్ డెవలప్‌మెంట్, ఎంప్లాయిమెంట్ ఫౌండేషన్ సీఈఓ సోంకీషా అన్నారు. గురువారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని లక్ష్మీ కన్వెన్షన్ హాల్‌లో ఆర్ఫ్ డెవలప్‌మెంట్, ఎంప్లాయిమెంట్ ఫౌండేషన్, మైక్రోసాఫ్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెంట్, కోడింగ్‌పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులు తమ అభ్యసనను కొనసాగించాలన్నారు. విద్యార్థి దశ నుంచే కంప్యూటర్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెంట్, కోడింగ్‌పై అవగాహన ఉండాలన్నారు. అనంతరం మల్లాపూర్, సాహెబ్‌నగర్, ఫలక్‌నుమా, రంగన్నగుట్ట, చంపాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, జ్ఞాపికలను అందచేశారు.

‘బీఆర్ఎస్, కాంగ్రెస్ మోసపూరిత పార్టీలు’



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మన్సూరాబాద్: ఇందిరమ్మ రాజ్యం అంటే ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలపై దాడులు చేయడమేనా అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం ఎల్‌బీనగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రంగారెడ్డి అర్బన్ జిల్లాలో 22 డివిజన్లు ఉండగా 16 డివిజన్లకు అధ్యక్షులు, 13 మంది జిల్లా కౌన్సిల్ సభ్యులను ప్రకటించారు. సామ రంగారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలు అమలు చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రతిపక్ష పార్టీలపై దాడులకు పాల్పడుతుందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసపూరిత పార్టీలన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూస్తా



మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలో తాగునీటి సమస్య రాకుండా చూస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని ఆర్‌కేఆర్ ఎన్‌క్లేవ్‌కాలనీ, దాతునగర్, నందనవనంకాలనీ తదితర ప్రాంతాల్లో గురువారం ఆమె పర్యటించి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రానున్న వేసవిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు జీహెచ్ఎంసీ నుంచి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మమతాగౌడ్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

నియామకం

మన్సూరాబాద్: కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా మన్సూరాబాద్ డివిజన్ పరిధి హయత్‌నగర్‌కు చెందిన అల్వాల్ దివ్యను నియమించారు. ఈ మేరకు సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ గురువారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా దివ్య మాట్లాడుతూ.. ఎలాంటి పదవులు ఆశించకుండా పార్టీ కొసం పనిచేశానని, పార్టీ గుర్తించి పదవి ఇచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న దివ్య

వరద కాలువలోకి డ్రైనేజీ మురుగు కలపొద్దు



అధికారులతో మాట్లాడుతున్న కాలనీవాసులు

మన్సూరాబాద్: వరద కాలువలో అపార్ట్‌మెంట్ల డ్రైనేజీ మురుగును కలిపేందుకు సివరేజీ బోర్డు, జలమండలి అధికారుల యత్నాన్ని సెంట్రల్‌బ్యాంక్ కాలనీవాసులు అడ్డుకున్నారు. సెంట్రల్‌బ్యాంక్ కాలనీలో 4 నెలల క్రితం వరద కాలువ నిర్మాణం చేపట్టారు. నిర్మాణ సమయంలో డ్రైనేజీ మురుగు కలుపొదంటూ కాలనీవాసులు అడ్డుకోవడంతో అధికారులు హామీపత్రం ఇచ్చారు. నెల రోజుల క్రితం మళ్లీ కలిపేందుకు ప్రయత్నించగా కాలనీవాసులు అడ్డుకోవడంతో వెనుదిరిగారు. ఈ క్రమంలో గురువారం సివరేజీ బోర్డు, జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బోర్డు విజిలెన్స్ టీమ్ సీఈఓ జ్ఞానేశ్వర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సురేష్‌తో పాటు పోలీసు అధికారుల బందోబస్తుతో వచ్చి కలుపేందుకు ప్రయత్నిస్తుండగా కాలనీవాసులు అడ్డుకున్నారు. ఈ విషయంపై కాలనీ సంక్షేమ సంఘం కోర్టుకు వెళ్లడం జరిగిందని, కోర్టు స్టే ఇచ్చిందని ఆర్డర్ కాపీని శుక్రవారం అందజేస్తామని అడ్వొకేట్ ప్రభాకర్‌శర్మ అధికారులకు తెలుపడంతో పనులు నిలిపివేశారు. సివరేజీ బోర్డు, జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి తమ విజిలెన్స్ సీఈఓతో పాటు భారీగా పోలీసులతో వచ్చి కాలనీవాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జక్కిడి తిరుమల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

జాహెద్‌కు ఏమైనా జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత

సైదాబాద్: చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఉగ్రదాడి కుట్ర కేసు నిందితుడు మహ్మద్ జాహెద్ అలియాస్ మోటూకు ఏమైనా జరిగినా రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అతడి కుటుంబ సభ్యులు గురువారం చంచల్‌గూడ కేంద్ర కారాగారాం ప్రధాన ద్వారం వద్ద ఆందోళన చేపట్టారు. షుగర్‌తో బాధపడుతున్న జాహెద్‌కు జైలులో సరైన ఆహారం, వైద్యం అందించడం లేదని ఆరోపించారు. కక్షపూరితంగా వ్యవహరిస్తున్న జైలు అధికారులు జాహెద్‌ను ఈ నెల 2న చర్లపల్లి జైలు నుంచి చంచల్‌గూడకు తరలించారని అధికారులు న్యాయస్థానం ఆదేశాలు కూడా పాటించకుండా అతడిని ఇబ్బందులకు గురి చేస్తూ ములాఖత్‌లు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై జైలు అధికారులను వివరణ కోరగా వారి ఆరోపణలు వాస్తవం కాదని, జైలు నిబంధనలు మేరకే తాము వ్యవహరిస్తున్నామన్నారు.

బాధ్యతల స్వీకరణ

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజవర్గం శ్రీ రామకృష్ణాపురం డివిజన్‌లో శ్రీ ఖిల్లా మైసమ్మ దేవస్థానం ధర్మకర్తగా చిలుకూరి లక్ష్మీ రామాచారి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పున్న నిర్మలా గణేష్ నేత, ఖిల్లా మైసమ్మ దేవాలయం చైర్మన్ సురేందర్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత నాయకులు ఉపేందర్‌రెడ్డి శాలువాతో సత్కరించారు.

విద్యార్థినిని వేధించిన యువకుడికి రెండేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: విద్యార్థినిని వేధించిన ఓ యువకుడికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. కోర్టు ఏపీపీ సునితా బర్ల వివరాల ప్రకారం.. జైపురికాలనీలో నివాసించే బాలిక స్థానికంగా 9వ తరగతి చదువుతోంది. పాఠశాలకు వెళ్లి వస్తున్న క్రమంలో నవీన్(19) అనే యువకుడు అడ్డగించి పెళ్లి చేసుకోవాలని వేధించేవాడు. అంతటితో ఆగకుండా నిందితుడు బాలిక ఇంటికెళ్లి వేధించేందుకు ప్రయత్నించగా తల్లి గమనించి వారిస్తుండగా నవీన్ తల్లికూతుళ్లపై దాడి చేశాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి యం.కె.పద్మావతి నవీన్‌కు రెండేళ్ల జైలుశిక్ష, రూ. 4వేల జరిమానా విధించారు. బాధితురాలికి రూ. 50 వేల నష్టపరిహారం చెల్లించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థకు సిఫార్సు చేస్తూ తీర్పునిచ్చారు.

సమస్య పరిష్కారానికి ఐక్యత చాటాలి

మలక్‌పేట: సమస్యల పరిష్కారానికి క్రైస్తవులు ఐక్యత చాటాలని సీనియర్ పాస్టర్, రెవరెండ్ డాక్టర్ ఎంఎస్ ప్రభు చరణ్ అన్నారు. మూసారంబాగ్ క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చిలో గురువారం మలక్‌పేట నియోజకవర్గం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవరెండ్ బోడ సాల్మన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రోళ్ల మాణిక్యం అబ్రహం, కోశాధికారి శ్రీధర్ రాజు, పాస్టర్లు యిర్మీయా, వన్య ఇమ్మానుయేల్, నాయకులు జయరాజ్, ముఖేష్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలి

మలక్‌పేట: పెండింగ్‌లో ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అధికారులను ఆదేశించారు. గురువారం పంజేషాలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వాటర్ వర్క్స్ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించి కొత్త పనులు, పెండింగ్ పనులపై చర్చించారు. నియోజకవర్గంలో అవసరమైన చోట్ల డ్రైనేజీ, వాటర్ పైపులైన్ కొత్త పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సయ్యద్ మినాజుద్దీన్, అబ్దుల్ షాహిద్ సలాం, వాటర్ వర్క్స్ జీఎం, డీజీఎం, ఏరియా మేనేజర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

మలక్‌పేట: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం బాధ్యతగా భావించాలని సౌత్ ఈస్ట్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో గురువారం దిల్‌సుఖ్‌నగర్‌లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. పాదచారులు ఫుట్‌పాత్‌లను ఉపయోగించుకోవాలని, జీబ్రా లైన్ వద్ద రోడ్డు దాటాలని సూచించారు. ద్విచక్రవాహన దారులు హెల్మెట్ ధరించడం మంచిదని, సర్టిఫికెట్లు రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, ఆర్ ఎస్సై రాము, ట్రాఫిక్ పోలీసులు ఉన్నారు.

ఆర్టీసీ కండక్టర్ అదృశ్యం



రాజేశ్వర్

హయత్‌నగర్: డ్యూటీకని వెళ్లిన ఆర్టీసీ కండక్టర్ అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. హయత్‌నగర్‌లోని వీరబద్రానగర్ కాలనీకి చెందిన పెరుమడ్ల రాజేశ్వర్(41) ముషిరాబాద్ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 14న డ్యూటీ కని ఇంట్లో నుంచి వెళ్లిన రాజేశ్వర్ ఎంతకీ రాలేదు. ఆందోళనకు గు రైన కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముగ్గురు మైనర్ బాలురు అదృశ్యం

హయత్‌నగర్: ముగ్గురు మైనర్ బాలురు అదృశ్యం అయిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..హయత్‌నగర్ కాసు కాలనీకి చెందిన బద్దెపూరి పవన్ కుమారుడు శ్రీచరిత్(12) కుంట్లూర్ ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. బంజారా కాలనీకి చెందిన అప్ప శివకుమార్ కుమారుడు చరణ్(13) హయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శాంతినగర్ కాలనీకి చెందిన కార్తీక్(13) ముగ్గురు స్నేహితులు. బుధవారం స్కూలుకు వెళ్తున్నామని చెప్పి ఇంట్లోనుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. వారికోసం కుటుంబ సభ్యులు బంధువులు స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో శ్రీచరిత్, చరణ్ కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్తీక్ కుటుంబ సభ్యులు ఇంత వరకు ఫిర్యాదు చేయలేదు. హయత్‌నగర్‌లోని జీ స్కూల్ సమీపంలోని ఓ సీసీ టీవి ఫుటేజీలో వీరు ముగ్గురు కలిసి ఉన్నట్లు కనిపించిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎస్సీ రిజర్వేషన్‌ను 18 శాతానికి పెంచాలి



వెంకటేష్‌ను సన్మానిస్తున్న ప్రభాకర్

మలక్‌పేట: ఎస్సీ రిజర్వేషన్ 15 నుంచి 18 శాతం పెంచాలని మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్టుపాక ప్రభాకర్ మాదిగ అన్నారు. గురువారం మలక్‌పేటలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వహించకుండా ఎస్సీ వర్గీకరణ కోసం కృషి చేయాలన్నారు. వర్గీకరణతోనే మాదిగలకు ఇతర కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొండగడుపుల వెంకటేష్‌ను నియమిస్తూ నియామక ఉత్తర్వులు జారీచేసి ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్, గాలయ్య, రవి, పవన్ తదితరలు పాల్గొన్నారు.

ధనుర్మాసం.. పోటెత్తిన భక్తజనం



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని అష్టలక్ష్మీ దేవాలయంలో ధనుర్మాసం సందర్భంగా గురువారం మాల మార్పిడి చేశారు. ఈ సందర్భంగా గోదా రంగనాథులకు వివిధ ఆలయాల నుంచి విచ్చేసి మాల సమర్పణ నిర్వహించారు. అనంతరం సామూహిక మంగళ హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమ సురే ష్‌కుమార్, మాజీ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్త, ప్రధాన కార్యదర్శి గంప జగన్, మేడం సుధాకర్‌గుప్త, వైస్ చైర్మన్ నాగమల్లు శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.